కుక్కరిసిపోతున్నాయ్!

- అరుస్తున్నాయ్.. కరుస్తున్నాయ్
- పెరుగుతున్న కుక్కల బెడద
- భయాందోళన చెందుతున్న ప్రజానీకం

పెద్దాపురం: ఎక్కడ చూసినా.. ఏ వీధికెళ్లినా.. కుక్కలే. భౌ భౌ అంటూ గర్జిస్తూ మీదకు వస్తున్నాయి.. జనాన్ని హడలెత్తిస్తున్నాయి.. గుంపులు గుంపులుగా తిరుగుతూ భయాందోళన కలిగిస్తున్నాయి.. పెద్దాపురం నియోజకవర్గంలో ఈ పరిస్థితి నానాటికీ చేయిదాటింది. పెద్దాపురం పట్టణంతో పాటు రూరల్‌లోని గ్రామాల్లో గ్రామ సింహాలు స్వైర విహారం చేస్తున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారు. రోజూ ఏదొక చోట, ఎవరో ఒకరు కుక్కకాట్లకు గురవుతున్న సంఘటనలు ఉన్నాయి.

అక్షరాల ఇరవై వేలు

అక్షరాల ఇరవై వేలు.. ఇదేదో ఊరు జనాభా అనుకునేరు. కాదండోయ్.. పెద్దాపురం నియోజకవర్గంలోని సామర్లకోట, పెద్దాపురం పట్టణాలతో పాటు రెండు మండలాల్లో వీధికుక్కల సంఖ్య ఇది. పలు గ్రామాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ పలువురిని గాయపరుస్తున్నాయి. ప్రధానంగా మాంసం, చేపల విక్రయ దుకాణాల వద్ద ఎక్కువగా ఉంటున్నాయి. జనావాసాలు ఉన్న వీధుల్లోనూ తిష్ట వేస్తున్నారు. అటుగా రాకపోకలు సాగించే వారిపై దాడి చేస్తున్నాయి. పల్లెల్లో కుక్కలు లేని వీధి లేదంటే ఆశ్చర్యం కలగకమానదు. ఇక చీకటి పడితే చాలు బయటకు రావడానికి జనం జంకుతున్నారు. చిన్న పిల్లలను సాయంత్రం వేళ బయటకు పంపడం మానేశారు. ఇటీవల కాలంలో కుక్కకాట్లకు గురైన వారిలో చిన్నారులే అధికంగా ఉన్నారు. గత రెండు రోజుల కిందట సిరివాడ గ్రామంలో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసి పది మందిని గాయపర్చింది. పెద్దాపురం పట్టణంలోని వ్యాపార పుంతలో మరో ఇద్దరు కుక్క కాటుకు గురయ్యారు.


సిరివాడలో రోడ్డుపై కుక్కల గుంపు

పంచాయతీలదే బాధ్యత

పంచాయతీ రాజ్ యాక్ట్ ప్రకారం గ్రామాల్లో ప్రజలను వీధి కుక్కల నుంచి రక్షించాల్సిన బాధ్యత పంచాయతీలపై ఉంది. ముందుగానే కుక్కలను పట్టుకుని పశువైద్యాధికారితో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) వేయించాలి. కుక్కల సంఖ్య పెరగకుండా ఉండేందుకు వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలి. పెంపుడు కుక్కల యజమానులు పంచాయతీలో లైసెన్సు తీసుకుని, పన్ను కూడా చెల్లించాలి. కానీ పంచాయతీ పాలకులు మాత్రం కుక్కల సమస్య తమది కాదంటూ చేతులు దులుపేసుకుంటున్నారు. దీంతో రోజు రోజుకూ గ్రామాల్లో కుక్కల సంఖ్య పెరుగుతోంది.


కుక్కల దాడిలో సిరివాడకు చెందిన ఓ వ్యక్తి కాలికి గాయాలు (ఫైల్)

ఏడాదిలో మూడు వేలు దాటి..

ఏడాది వ్యవధిలో ఒక్క పెద్దాపురం మండలంలో కుక్కల కాట్లకు గురైన వారి సంఖ్య వెయ్యి దాటిందంటే తీవ్రత చెప్పకనే అర్థమవుతోంది. గత ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ (జూన్ నెలాఖరు వరకు) నియోజకవర్గంలో 3,054 మంది కుక్క కాట్లకు గురై చికిత్స పొందినట్లు అధికారిక లెక్కలు ఇలా ఉండగా, ప్రైవేట్ ఆసుత్రుల్లో చికిత్స పొందేవారి సంఖ్య కూడా ఎక్కువే. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గుంపులుగా కనిపిస్తున్నాయి



వీధి కుక్కలు ఎక్కడ చూసినా చెలరేగిపోతున్నాయి. నా కుమారుని వయసు రెండేళ్లు దాటింది. చేతిపై కుక్క కరవడంతో పెద్దాపురం సీహెచ్‌సీలో చికిత్స చేయించాం. ఇంటి నుంచి బయటకు వస్తే చాలు కుక్కలు గుంపులే కనిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని, గ్రామాల్లో శునకాలను నియంత్రించాలి.

– **తాడి కస్తూరి**, నాగంపేట, పెద్దాపురం

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



ఆయా గ్రామాల్లో కుక్కలను నియంత్రించాలని ఫిర్యాదులొస్తున్నాయి. రెండు రోజుల కిందట సిరివాడలో పది మందిని పిచ్చి కుక్క గాయపర్చింది. వారందరికీ యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందజేశాం. కుక్కకాటు బాధితుల కోసం ఆసుపత్రుల్లో ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. కుక్కలను నియంత్రించాలని కోరుతూ ఉన్నతాధికారులకు నివేదించాం.

– **శ్రీలలిత**, ఎంపీడీఓ, పెద్దాపురం

క్లుప్తంగా

బాపిరాజు కుటుంబ సభ్యులకు పరామర్శ


బాపిరాజు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దొరబాబు తదితరులు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గోలి బాపిరాజు కుటుంబ సభ్యులను ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దవులూరి దొరబాబు శనివారం పరామర్శించారు. శుక్రవారం ఉదయం గోలి బాపిరాజు మృతి చెందిన విషయం విధితమే. ఈ మేరకు వేట్లపాలెంలోని బాపిరాజు స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాపిరాజు మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మొరంపూడి శ్రీరంగనాయకులు, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, ఉపాధ్యక్షుడు నిడదవోలు రాంబాబు, మండల వ్యవసాయ సలహా మండలి మాజీ అధ్యక్షుడు సురేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు అరికట్టాలని నిరసన


నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

సామర్లకోట: పారా మెడికల్ విద్యార్థినులపై జరిగిన లైంగిక వేధింపులకు నిరసనగా పట్టణ ఐద్వా ఆధ్వర్యంలో శనివారం ప్రదర్శన నిర్వహించారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వరలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మాణమ్మ కాలనీ నుంచి ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి సత్వరమే దోషులను శిక్షించాలని సీఐటీయూ నాయకురాలు టి.నాగమణి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా సంఘ నాయకులు టి.సూర్యకళ, సీహెచ్ రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీవన రేఖలు కథా సంపుటి ఆవిష్కరణ

బోట్‌క్లబ్: స్థానిక గాంధీభవన్‌లో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శనివారం ఇంద్రగంటి నరసింహమూర్తి రచించిన 'జీవన రేఖలు' కథా సంపుటి పరిచయ సభ జరిగింది. డాక్టర్ జోస్యుల కృష్ణబాబు మాట్లాడుతూ ఇంద్రగంటి నరసింహమూర్తి సమకాలీన సామాజిక అంశాలపై కథలు రాస్తూ, మానవ సంబంధాలను, భావోద్వేగాలనూ చక్కగా పండిస్తారన్నారు. పి.పద్మజావాణి సమీక్షిస్తూ మానవతా విలువలను తట్టిలేపే సంస్కారం, ఆశావహ దృక్పథం కలిగిన 24 కథల సమాహారం ఈ జీవన రేఖలు అంటూ ప్రశంసించారు. కుమారి ఇందిర మాట్లాడుతూ మధ్యతరగతి మధురహాసాలకు, నైతిక విలువల ప్రాధాన్యానికి నిలువెత్తు సంతకాలు ఇంద్రగంటి కథలు అన్నారు. రచయిత ఇంద్రగంటి నరసింహమూర్తి స్పందన తెలియజేస్తూ, నిరంతరం నిబద్ధతతో సాహిత్యానికి పట్టంకడుతున్న సాహితీ స్రవంతి కాకినాడ శాఖ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మార్ని జానకిరామ చౌదరి అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది.

మాజీ మంత్రి 'పంతం'కు నివాళి


పంతం పద్మనాభం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దాపురం: మాజీ మంత్రి పంతం పద్మనాభంకు కాండ్రకోట గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం నివాళులర్పించారు. ఆయన 26వ వర్థంతి సందర్భంగా పద్మనాభం విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు జోకా నానాజీ, గవరసాని రాజశేఖర్ తదితరులు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు ఎంతో మంది యువతకు ఉపాధి కల్పించిన ఘనత పంతం పద్మనాభంకే దక్కుతుందన్నారు. మెట్ట ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన ఆయనే అని కొనియాడారు. కార్యక్రమంలో ఊటా రాజుబాబు, ఒబిలిశెట్టి నాగభూషణం, పెచ్చెట్టి రాజు, రెడ్డి బాబులు తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవునికి వెండి పళ్లెం సమర్పణ

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీరవేంకట సత్యనారాయణ స్వామివారికి హైదరాబాద్‌కు చెందిన కె.రఘుమోహన్ గుప్తా, శ్రీలేఖ దంపతులు 820 గ్రాముల వెండి పళ్లాన్ని శనివారం సమర్పించారు. దీని ఖరీదు రూ.92 వేలు అని చెప్పారు. ఈ పళ్లాన్ని సత్యదేవుని ఆలయంలో పూజలకు ఉపయోగించాలని దాత కోరినట్టు దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు తెలిపారు.

సాగునీరు అందక రైతులు గగ్గోలు

- పవన్ కల్యాణ్ వెంటనే స్పందించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు

పిఠాపురం: ఉభయగోదావరి జిల్లాల్లో రైతులు ఇప్పటికే నారుమళ్లు వేశారని, కానీ పిఠాపురం నియోజకవర్గంలో ఏలేరు నీరు రాక నారుమళ్లు వేయక రైతులు గగ్గోలు పెడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు విమర్శించారు. శనివారం మధ్యాహ్నం నుంచి సీపీఐ కాకినాడ జిల్లా మహాసభల జయప్రదం కోరుతూ పిఠాపురం పట్టణంలో ఇంటింటికీ సీపీఐ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఠాపురం ఎమ్మెల్యేగా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ పిఠాపురంలో రైతులకు న్యాయం చేయడంలో ఘోర వైఫల్యం చెందుతున్నారని అన్నారు. రైతు బాగుంటేనే దేశం, మన ప్రాంతం బాగుంటుందని, అలాంటి రైతు మానసిక క్షోభతో ఉన్నారన్నారు. పవన్ కల్యాణ్ వెంటనే పిఠాపురం వచ్చి ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. పంటలకు పూర్తి నీరు అందించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో సామర్లకోటలో జరిగే సీపీఐ కాకినాడ జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని మధు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, పట్టణ కార్యదర్శి సాకా రామకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి కేశవరపు అప్పలరాజు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.భవాని, ప్రజా నాట్య మండలి జిల్లా కన్వీనర్ మడగల రమణ, అర్జున్‌రావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు ఎస్.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఎరువుల విక్రయాలు


వి.మురళీధర్, మండల వ్యవసాయ అధికారి

సామర్లకోట: నిబంధనల మేరకే ఎరువులను విక్రయిస్తున్నామని మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్ తెలిపారు. 'ఎరువు.. కరవు' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. శుక్రవారం పీబీ దేవం ప్రాథమిక సహకారం సంఘానికి ఎరువులు రావడంతో రైతులు ఒక్కసారిగా వచ్చినా నిజమైన అర్హులకు అందలేదు. దీనిపై 'సాక్షి'లో కథనం వచ్చింది. ఈ మేరకు ఏఓ మాట్లాడుతూ శుక్రవారం పీబీ దేవంలోని సొసైటీకి 20 మెట్రిక్ టన్నుల డీఏపీ రావడంతో చుట్టుపక్కల రైతులు ఒకేసారి రావడం వల్ల పేర్లు నమోదు చేయించుకుని, డబ్బులు తీసుకుని డీఏపీ ఇవ్వడం వల్ల కొద్దిగా వేచి ఉండాల్సి వచ్చిందన్నారు. అయితే మండలంలో ఎక్కడా డీఏపీ, యూరియా కొరత లేదని అన్నారు. శనివారం మరో 20 మెట్రిక్ టన్నుల డీఏపీ పీబీ దేవం సొసైటీకి వచ్చిందన్నారు. సామర్లకోట ఆర్‌బీకేలో 10 మెట్రిక్ టన్నుల డీఏపీ, 40 మెట్రిక్ టన్నుల యూరియా, ఉండూరు ఆర్‌బీకే-1లో 20 మెట్రిక్ టన్నుల యూరియా, ఆర్‌బీకే-2లో 20 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని చెప్పారు. ఈ రెండు ఆర్‌బీకేల్లో డీఏపీ లేదని అంగీకరించారు. వీకే రాయపురం ఆర్‌బీకేలో 20 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని, డీఏపీ లేదన్నారు. హుస్సేన్‌పురం ఆర్‌బీకేలో 10 మెట్రిక్ టన్నుల డీఏపీ ఉండగా, యూరియా లేదన్నారు. అదేవిధంగా జి.మేడపాడు సొసైటీలో 60 మెట్రిక్ టన్నుల డీఏపీ, 101 టన్నుల యూరియా ఉందన్నారు.

కాలుష్యంతో కాలువరపాట్లు



పిఠాపురం సమీపంలో నవ ఖండ్రవాడ వద్ద కంపు కొడుతున్న పీబీసీ కాలువలో సాగు, తాగునీరు

పిఠాపురం: ఈపాటికి పంట పొలాలు కళకళలాడుతుండేవి.. చేల నిండా రైతులు కూలీలతో వ్యవసాయ పనుల్లో క్షణం తీరిక లేకుండా ఉండేవారు. కానీ ఈ ఏడాది పరిస్థితి తారుమారైంది. సకాలంలో వర్షాలు లేవు. కాలువలకు సాగునీరు లేదు. చెరువులు ఎండుతున్నాయి. కాలువలకు వదిలిన నీరు కంపు కొడుతోంది. మూగజీవాల గొంతెండుతోంది. కాలువలకు అక్కడక్కడా వదిలిన నీరు కలుషితమై దుర్గంధం వెదజల్లుతూ కనీసం పశువులు కూడా తాగలేని దుస్థితి నెలకొంది. పిఠాపురం బ్రాంచ్ కెనాల్‌కు వదిలిన నీరు నలుపు రంగులో ముక్కుపుటాలు అదిరేలా దుర్గంధం వెదజల్లుతుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. సామర్లకోట వద్ద ఉన్న వివిధ పరిశ్రమల వ్యర్థాలతో పాటు కాలువలో కుళ్లిన చెత్తతో కలసి మురికి నీరు వస్తోంది. పీబీసీ నీరే కొత్తపల్లి మండలం వాకతిప్ప సూరప్ప చెరువు, గొల్లప్రోలు మండలం ఆర్‌ఆర్‌బీ ట్యాంకులలో ఉన్న మంచినీటి పథకాలకు వెళుతుంది. ఇంత దారుణంగా ఎప్పుడు చూడలేదని, ఇదే నీరు తాగునీటి పథకాలకు ఉపయోగిస్తే లేని రోగాలు వస్తాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క కాలువ నీటిని ఇంజిన్ల ద్వారా తోడి నారుమళ్లు వేసుకునే రైతులు సైతం కలుషితమైన నీటి వల్ల నారుమళ్లు దెబ్బతినే అవకాశం ఉందని, మానేసినట్లు రైతులు చెబుతున్నారు. ఇప్పటికే సాగు నీరందక ఖరీఫ్ సాగు ఆగిపోవడంతో పాటు వదిలిన నీరు పని చేయకుండా ఉండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'రంగరాయ'లో క్రీడోత్సవం ప్రారంభం

కాకినాడ క్రైం: స్థానిక రంగరాయ వైద్య కళాశాలలో 67వ వార్షికోత్సవ క్రీడోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. రుధిర పేరుతో నిర్వహిస్తున్న ఈ క్రీడోత్సవం రెండు వారాల పాటు జరగనుంది. ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తులూరి విష్ణువర్ధన్ ఈ క్రీడోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల మనోవికాసం కోసం ప్రతి ఏడాది క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగరాయ వైద్య కళాశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ మేటిగా నిలవాలని ఆకాంక్షించారు. ఆగస్టు 9న జరిగే ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. విజయమే లక్ష్యంగా విద్యార్థులు క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని అన్నారు. క్రీడలు స్నేహభావాన్ని, బృందానుసంధాన్ని పెంపొందిస్తాయని డాక్టర్ విష్ణువర్ధన్ అన్నారు. ఆర్‌ఎంసీ క్రీడల ఉపాధ్యక్షుడు డాక్టర్ ముఖర్జీ మాట్లాడుతూ, క్రీడా స్ఫూర్తిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శశి, క్రీడల ఉపాధ్యక్షురాలు డాక్టర్ శైలజ, అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్ బాబు, లేడీస్ హాస్టల్ వార్డెన్ డాక్టర్ లలిత, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు శాకంబరిగా నూకాలమ్మ


సామర్లకోటలో నూకాలమ్మ వారు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో వేంచేసి ఉన్న గ్రామ దేవత నూకాలమ్మ వారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య పర్యవేక్షణలో పంచారామ క్షేత్రంలోని దీపారాధన సంఘ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి శాకంబరి అలంకరణ చేస్తున్నారు. శనివారం సాయంత్రం నుంచి దీపారాధన సంఘ సభ్యులు అలంకరణ ప్రారంభించారు. సుమారు టన్ను కూరగాయలు, పండ్లు వినియోగిస్తున్నట్లు బుల్లియ్య చెప్పారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయ పారాయణ కమిటీ ఆధ్వర్యంలో పారాయణ ఉంటుందన్నారు.

23న చీర, సారె సమర్పణ

స్థానిక పంచారామ క్షేత్రంలోని అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవిని ఈ నెల 23న శాకంబరిగా అలంకరిస్తారు. ప్రతి ఏడాది ఆషాఢ మాసం మాస శివరాత్రి రోజున అలంకరణ ఉంటుంది. ఈ మేరకు నూకాలమ్మ ఆలయం నుంచి చీర, సారెను తీసుకు వెళ్తారని పంచారామ క్షేత్ర ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. ఆలయం నుంచి కోలాటం, బ్యాండ్ మేళం మధ్య స్టేషన్ సెంటర్, ఫ్లైఓవర్ మీదుగా సారె ఊరేగింపు ఉంటుందన్నారు.

నేటి నుంచి రుద్ర సహిత నవగ్రహ యాగం


సామర్లకోటలో అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక ఐదు తూముల వద్ద వేంచేసి ఉన్న అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి శ్రీరుద్ర సహిత నవగ్రహ యాగం చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త పరమానందగిరి స్వామి స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆదివారం నుంచి ఈ నెల 23 వరకూ ఆలయంలో శ్రీరుద్ర సహిత నవగ్రహ యాగం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారి అమ్మవార్ల ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం ఉంటుందన్నారు. అనంతరం విఘ్నేశ్వరపూజ, అంకురార్పణ, నవగ్రహ శాంతి, మండపారాధన, సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన హోమం జరుగుతాయన్నారు. సోమవారం నుంచి ఈ నెల 22 వరకూ ప్రతి రోజూ ఉదయం విఘ్నేశ్వర పూజ, అభిషేకం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పూజ, క్షీరాభిషేకం, నవగ్రహ వ్రతాలు, రామలింగేశ్వరస్వామికి పూజాభిషేకాలు ఉంటాయన్నారు. అదే విధంగాల ఈ నెల 15 నుంచి 22 వరకూ సాయంత్రం చండీ హోమాలు జరుగుతాయన్నారు. 23న పూర్ణాహుతితో యాగ కార్యక్రమాలు ముగుస్తాయని వివరించారు. ప్రతి రోజూ ఆలయ అర్చకులు పెండ్యాల సుబ్రహ్మణ్యం, దాకమూరి మణికంఠ ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయని చెప్పారు.

త్వరలో కేంద్ర సాంకేతిక కమిటీ పర్యటన

పిఠాపురం: ఉప్పాడలో చేనేత రంగం అభివృద్ధికి త్వరలో కేంద్ర సాంకేతిక కమిటీ పర్యటించనుందని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉప్పాడతో పాటు పలు గ్రామాల్లో చేనేత కార్మికులకు భరోసా కల్పించేందుకు నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మంజూరు చేసి నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించామన్నారు. దీనిపై స్పందించిన కేంద్రం త్వరలో చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న వీవర్స్ సర్వీస్ సెంటర్, జోనల్ డైరెక్టర్ నేతృత్వంలో సాంకేతిక కమిటీ ఉప్పాడలో పర్యటించి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు.

ఇదేమి దారిద్య్రం!

- అధ్వాన రోడ్లతో ప్రమాదాలు
- నడవాలంటేనే నరకం
- పట్టించుకోని యంత్రాంగం


గొర్రిపూడి సమీపంలో అధ్వానంగా మారిన రోడ్డు

కరప: ఇదేమి 'దారి'ద్య్రం.. నిండా నిర్లక్ష్యం.. అంటూ జనం నిట్టూర్పు వదులుతున్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి రహదారులు గుంతలు, గొప్పులతో మిగిలాయి. అటుగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు పడినప్పుడు ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటిస్తే తమ బాధలు తెలుస్తాయని గ్రామీణ వాసులు దుయ్యబడుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు శ్రమదానంతో సొంత ఖర్చుతో గోతులు పూడ్చించామని హడావుడి చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అధికారంలోకి వచ్చాక రోడ్లపై గోతులను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. మళ్లీ మరోసారి ఎమ్మెల్యే శ్రమదానం చేయించి, గోతులు పూడ్చించాలని, లేకుంటే రహదారులను పునర్నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కరప, తాళ్లరేవు మండలాలను అనుసంధానం చేసే జి.వేమవరం రోడ్డు మరీ దారుణంగా తయారైంది. గొర్రిపూడి నుంచి తాళ్లరేవు మండలం జి.వేమవరం మీదుగా మట్లపాలెం వెళ్లే రోడ్డు, గొర్రిపూడికి వెళ్లే రోడ్డు ఛిన్నాభిన్నమైంది. వేమవరం రోడ్డు రెండు మండలాలను కలుపుతుంది. ఈ రహదారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. గొర్రిపూడి గ్రామస్తులతోపాటు మండలంలోని వేములవాడ, కొంగోడు, పాతర్లగడ్డ, పెనుగుదురు, కరప తదితర గ్రామస్తులు తాళ్లరేవు మండలం, యానాం వైపు వెళ్లేవారు ఈ రహదారి నుంచే ప్రయాణాలు సాగిస్తుంటారు. అలాగే తాళ్లరేవు మండల వాసులు కూడా కరప మండలానికి ఈ రోడ్డుపైనే వెళ్తుంటారు. గొర్రిపూడి మార్కెట్ సెంటర్ నుంచి రోడ్డు పొడవునా పెద్ద గోతులు పడ్డాయి. ద్విచక్ర వాహనచోదకులు గోతుల్లో పడి అదుపుతప్పి పడి, గాయాల పాలవుతున్నారు. రాత్రి సమయాల్లో గోతులు కనపడక ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. రోడ్లపై ప్రయాణం భద్రత లేకుండా పోయిందని, తప్పనిసరి పరిస్థితుల్లో దేవుడిపై భారంవేసి వెళ్తున్నట్లు గ్రామస్తులు అంటున్నారు. రోడ్డు వేసేవరకైనా గోతులు పూడ్చించేందుకు చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. తాళ్లరేవు రిజిస్ట్రార్ కార్యాలయానికి, వేమవరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, పాఠశాలలకు వెళ్లేవారితో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అడుగడుగునా గోతులు పడటంతో సైకిళ్లపై వెళ్లేవారు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని గొర్రిపూడి గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.


నిధులు వచ్చినా..

గొర్రిపూడి గ్రామస్తుల వినతి మేరకు మాజీ మంత్రి కన్నబాబు రూ.1.64 కోట్లు మంజూరు చేశారు. ఆ గ్రామంలో సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మించేందుకు, గొర్రిపూడి నుంచి జి.వేమవరం వరకూ బీటీ రోడ్డు వేసేందుకు ఈ నిధులు మంజూరు చేశారు. 2023 సెప్టెంబర్ 19న పనులకు మాజీ మంత్రి భూమిపూజ చేశారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి, సీసీ డ్రెయిన్ నిర్మించి, మిగిలిన పనులు చేయకుండా నిర్లక్ష్యం చేశారు. తర్వాత ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏడాదైనా సదరు కాంట్రాక్టర్‌తో పనులు చేయించడంలో నాయకులు, అధికారులు శ్రద్ధ చూపడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.


జి.వేమవరం రహదారిలో తేలిన రాళ్లు


గొర్రిపూడిలో ఒకపక్క సీసీ రోడ్డు వేసి, మరోపక్క వేయకుండా వదిలేసిన వైనం

తరచూ ప్రమాదాలు



గొర్రిపూడి, వేమవరం రోడ్డు అడుగడుగునా గోతులు పడి చాలా దారుణంగా తయారైంది. సైకిళ్లు, బైక్‌లపై వెళ్లేవారు గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఎర్రంనీడి సుబ్రహ్మణ్యం, గొర్రిపూడి

గోతులనైనా పూడ్చించండి



రెండు మండలాలను కలిపే జి.వేమవరం రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. వాహనచోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. ఛిద్రమైన రోడ్లపై రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నాం. వర్షం వచ్చిందంటే చెరువులను తలపించే రోడ్లలో గుంతల కారణంగా నరకయాతన అనుభవిస్తున్నాం. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయమేస్తోంది. ఈ గోతులనైనా పూడ్చించాలి.

– **చీకాల అప్పలరాజు**, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, గొర్రిపూడి